01ATP21F_01ATP21F.qxd 21-01-2026 PM 10:54 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

గురువారం 22 జనవరి 2026 | పేజీలు : 04

రంజీ ట్రోఫీ మ్యాచ్‌లకు సర్వం సిద్ధం

కోచ్‌లతో మాంచూఫెర్రర్,ఇరు జట్ల కెప్టెన్లతో మ్యాచ్ రెఫరీల సమావేశం

అనంతపురం సిటీ, జనవరి 21 ప్రభాతవార్త

ఆర్డిటి క్రీడా మైదానం వేదికగా బుధవారం నుంచి జరగనున్న రంజి ట్రోఫీ రిసిప్ట్ మ్యాచ్‌కు సర్వం సిద్ధమైంది, నాలుగు రోజులపాటు ఆంధ్ర- విదర్భా జట్ల మధ్య రంజీ మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే ఇరు జట్ల క్రీడాకారులు ఆర్డిటి క్రీడా మైదానానికి చేరుకుని ముమ్మరంగా సాధన చేస్తున్నారు. మరోవైపు మ్యాచ్ రెఫరీలు సైతం గ్రౌండ్‌లను పరిశీలించారు. ఇరు జట్ల కెప్టెన్లతో రెఫరీలు సమావేశం నిర్వహించారు. అదే విధంగా మాంఛో ఫెర్రర్ సైతం బుధవారం ఆర్డిటి క్రీడా మైదానంలో పర్యటించి ఇరు జట్ల మేనేజర్లను కలిశారు. మ్యాచ్ ఏర్పాట్లను ఏడిసిఏ కార్యదర్శి యుగంధర్‌రెడ్డి వారికి వివరించారు. ఆంధ్ర-విదర్భా జట్టులో పలువురు కీలక క్రీడాకారులు పాల్గొననుండటంతో మ్యాచ్‌లపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

అనంతపురం జిల్లా నూతన సంయుక్త కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఇంచార్జి జిల్లా కలెక్టర్ సి.విష్ణు చరణ్

సంయుక్త కలెక్టర్‌గా బాధ్యతలు చేపడుతున్న సి.విష్ణుచరణ్

అనంతపురం కలెక్టరేట్ జనవరి 21 ప్రభాతవార్త

అనంతపురం కలెక్టరేట్ లోని జిల్లా సంయుక్త కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా నూతన సంయుక్త కలెక్టర్ సి.విష్ణు చరణ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఇంచార్జి జిల్లా కలెక్టర్ గా కూడా బాధ్యతలను స్వీకరించారు. బదిలీపై వెళ్లిన జిల్లా సంయుక్త కలెక్టర్, ఇంఛార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ నుంచి నూతన సంయుక్త కలెక్టర్ గా, ఇంచార్జి జిల్లా కలెక్టర్ గా సి.విష్ణు చరణ్ బాధ్యతలు స్వీకరించడం జరిగింది.అంతకుముందు కలెక్టరేట్ కు చేరుకున్న నూతన సంయుక్త కలెక్టర్ సి.విష్ణు చరణ్ కి డిఆర్ఓ ఎ.మలోల, కలెక్టరేట్ ఏవో అలెగ్జాండర్, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు యోగేశ్వరి దేవి, రియాజుద్దీన్, వసంతలత, ఎండోమెంట్ ఏసీ మల్లికార్జున ప్రసాద్, తదితరులు పూలమొక్కలు అందించి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, ఆర్డీఓ కేశవ నాయుడు, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణరెడ్డి, ఎస్డీసి ఆనంద్, సిపిఓ అశోక్ కుమార్, జిజిహెచ్ అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ గంగాధర్ రెడ్డి, తహసీల్దార్ హరికుమార్, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వీరిని అలా వదిలేయకండి..

సమయపాలన నేర్పండి..!

❖ ఉలుకు పలుకూ లేని ఉన్నతాధికారులు
❖ పట్టింపులేని పాలకులు..ప్రజలకు తప్పని వెతలు

11.45 గంటలకు వెక్కిరిస్తున్న తహసీల్దార్ కార్యాలయం

11.30 గంటలకు వెలవెలపోతున్న ఎంపీడీవో కార్యాలయం

11.45 గంటలకు తలుపులే తెరచుకోని డిప్యూటీ ఎంపీడీవో గది



11.50 గంటలకు ఖాళీగా దర్శనమిస్తున్న విద్యుత్తు ఏఈ కుర్చీ

12.00 గంటలకు కూడా తెరచుకోని యాడికి పంచాయతీ ఈవో గది

యాడికి (తాడిపత్రి), జనవరి 21, ప్రభాతవార్త

ఆ అధికారులంతా తమ కింది స్థాయి సిబ్బందికి ఆదర్శంగా ఉండాల్సిన వారు. మండల వ్యాపంగా ఉన్న 60 వేల మందికి పైగా జనాభాకు జవాబుదారీగా ఉండాల్సినవారు. ఒక్కొక్కరు తమ శాఖ పరిధిలో తమ కింద విధులు నిర్వహించే దాదాపు 50 మందికి పైగా ఉద్యోగులకు, సిబ్బందికి మార్గదర్శనం చేయాల్సినవారు. మండలంలోని ఏ మారుమూల పల్లెలో కాదు..మండల కేంద్రంలోనే విధులు నిర్వహిస్తూ ప్రజాసేవలో అంకితభావం చూపాల్సినవారు. కానీ అంతా మా ఇష్టం అన్నట్లు సమయపాలనకు మంగళం పాడుతున్నారు. మేం వచ్చిందే సమయం..మేం చేసిందే కార్యం అన్నట్లు ఈ అధికారులు వ్యవహరిస్తూ ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్నారు. ఏ ఒక్క బాధితుడు తమ పని సంబంధిత కార్యాలయానికి వెళ్లినరోజే పూర్తయిందని చెప్పుకోలేని పరిస్థితులు ఇక్కడ తలెత్తుతున్నాయి. అడిగే అధికారి లేక..పట్టించుకునే పాలకులు లేక మండల స్థాయి అధికారులే ఇలా వ్యవహరిస్తుంటే ఇక మారుమూలన ఉన్న సచివాలయాల సిబ్బంది పరిస్థితి వేరే చెప్పక్కరలేదని జనం గగ్గోలు పెడుతున్నారు. ఆయా మండల స్థాయి అధికారులు తమ కార్యాలయాల్లో సమయపాలన లేకుండా అడుగుపెట్టిన వెంటనే వారి చుట్టూ సామాన్య జనాన్ని కాదని పలుకుబడిని ప్రయోగించి పనులు జరుపుకునే దళారులే చుట్టుముడుతున్నారని, ఇక సామాన్య జనం పనులు జరగాలంటే గంటలు, రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

రెవెన్యూ కార్యాలయంలో పనిజరగాలంటే వీఆర్వో, ఆర్ఐ, డీటీ, తహసీల్దార్‌లు తప్పనిసరి. వీరిలో ఏ ఒక్కరు రాకపోయినా, సమయ పాలన పాటించకపోయినా బాధితులు ఒకటికి రెండు రోజులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సిందే. మండలంలోని సచివాలయాలు నిర్వీర్యం అవుతుండటంతో ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవోల వద్దకు వచ్చి సమస్య చెప్పుకుందామంటే వారు ఎప్పుడు ఉంటారో తెలియని పరిస్థితి. ఇక విద్యుత్తు సమస్యలపై సంబంధిత అధికారిని కలుద్దామంటే ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి చూడాల్సిందే. ఆ రోజు ఆయన ఆలస్యంగా వచ్చి ఎక్కడికైనా క్షేత్రస్థాయికి వెళ్లాడంటే మరుసటి రోజు తమ అదృష్టాన్ని ప్రజలు పరీక్షించుకోవాల్సిందే. 20 వేలకు పైగా జనాభా ఉన్న యాడికి మేజర్ పంచాయతీ బాధ్యతలు మరో పంచాయతీ కార్యదర్శి చేతుల్లో పెట్టడంతో పాలన ఇబ్బందికరంగా మారి ఏ సమస్యకు ఎవరిని సంప్రదించాలో తెలియని అయోమయం ప్రజల్లో నెలకొంది. ఆయన ఎప్పుడు వస్తాడో తెలియక.., సిబ్బంది నుంచి సమాధానం కరవై..,కొందరు బదులు సిబ్బంది తమ పరిధిని దాటి అక్రమ వసూల్లకు పాల్పడుతున్నా..పట్టించుకోవాల్సిన పాలకవర్గం చేష్టలుడిగి చూస్తున్నా..పరాయి పెత్తనం పెరిగి పంచాయతీ పతనమవుతున్నా అడిగే నాథుడే లేకుండా పోతున్నారు. మండలానికి దిక్సూచిలా ఉండాల్సిన మండల స్థాయి అధికారులను అలా వదిలేయకుండా వారికి ఉన్నతాధికారులు సమయపాలన నేర్పించాలని మండల వ్యాప్త ప్రజలు కోరుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా పోలీసుల గ్రామసభలు

అసాంఘిక కార్యక్రమాలపై అవగాహన కల్పించాలి

- జిల్లా ఎస్పీ పి.జగదీష్

అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అనంతపురం కలెక్టరేట్ జనవరి 21 ప్రభాతవార్త

జిల్లా వ్యాప్తంగా పోలీసులు గ్రామసభలు నిర్వహిస్తూ ప్రజలకు వివిధ సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలని ఆయా పోలీస్ స్టేషన్ అధికారులకు జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాలు ఇచ్చారు.ఈ గ్రామసభలలో అసాంఘిక కార్యకలాపాలు, గొడవలు, హింసాత్మక చర్యలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. యువత చెడు అలవాట్లకు లోనవకుండా మంచి మార్గంలో సాగేందుకు విద్య, ఉపాధి, క్రీడల వైపు దృష్టి సారించాలని మార్గనిర్దేశం చేశారు. అలాగే రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా అనేక విలువైన ప్రాణాలనుకాపాడవచ్చని వివరించారు. అలాగే మహిళల భద్రతపై అమలులో ఉన్న చట్టాలు, మహిళలపై జరిగే నేరాలపై కఠిన చర్యలు తీసుకుంటున్న విషయాన్ని ప్రజలకు తెలియజేశారు. బాల్యవివాహాల వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక నష్టాలపై అవగాహన కల్పిస్తూ, చట్ట ప్రకారం అవి నేరమని స్పష్టం చేశారు.ప్రజలు పోలీస్ శాఖతో సమన్వయం కలిగి శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడమే లక్ష్యంగా ఇలాంటి గ్రామసభలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా ఎస్పీ పి, జగదీష్ తెలిపారు.

సర్వేల చక్రబంధంలో

సచివాలయ వ్యవస్థ

– విశ్రాంతి లేని విధులు అంతులేని సర్వేలతో సచివాలయ సిబ్బంది ఉక్కిరిబిక్కిరి.
– పని ఒత్తిడి తగ్గించాలని కోరుతున్న సచివాలయ ఉద్యోగులు.

అనంతపురం రూరల్,జనవరి 21 ప్రభాతవార్త

రాష్ట్రంలో గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ఇప్పుడు సర్వేల సుడిగుండంలో చిక్కుకుంది. ప్రజలకు తక్షణ సేవలు అందించడమే లక్ష్యంగా ఏర్పడిన ఈ వ్యవస్థ, ఇప్పుడు కేవలం డేటా సేకరణకే పరిమితమవుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వరుసగా వస్తున్న సర్వేలు, అంతులేని యాప్ అప్‌లోడ్లతో సచివాలయ ఉద్యోగులు తీవ్ర మానసిక, శారీరక ఒత్తిడికి లోనవుతున్నారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల సచివాలయ ఉద్యోగులు పని ఒత్తిడికి లోనై ప్రాణాలు విడిచిన సంఘటనలు కూడా జరిగాయి.

ప్రతిరోజు జిల్లా అధికారి నుండి కిందిస్థాయి అధికారుల వరకు ప్రతి ఒక్కరూ కాన్ఫరెన్స్ లలో ఉద్యోగులను మరింత పని ఒత్తిడికి గురి చేస్తున్నారని ఉద్యోగులు అంటున్నారు. అదేవిధంగా ప్రభుత్వం చెప్పిన ఫ్యామిలీ సర్వేల నిర్వహణలో భాగంగా ప్రజల వద్దకు వెళ్లగా మీకు వివరాలు ఎందుకు ఇవ్వాలి అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారని, వివరాలు సేకరించకపోతే మీరు పని చేయడం లేదని ఉన్నతాధికారులు ఆదేశాలు పాటించలేక పూర్తిస్థాయిలో సర్వేలు సేకరించలేక మానసిక వత్తడికి లోనవుతున్నట్టు ఉద్యోగులు బహిరంగంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొద్ది రోజులుగా ప్రభుత్వం విభిన్న రకాల సర్వేలను ఒకేసారి ప్రవేశపెట్టడంతో ఉద్యోగులపై పని భారం పెరిగిందని సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఒక్కో ఉద్యోగికి కేటాయించిన లక్ష్యాలు చూస్తుంటే ఆశ్చర్యం కలగక మానదు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల వెరిఫికేషన్ నుంచి పారిశుద్ధం, విద్యుత్, సామాజిక తనిఖీల వరకు దాదాపు పదుల సంఖ్యలో సర్వేలు ఒక్కొక్కరిపై వేస్తున్నారు. దీనికి తోడు సాంకేతిక ఇబ్బందులు తోడవుతున్నాయి. సర్వర్లు మొరాయించడం, నెట్‌వర్క్ సిగ్నల్స్ అందకపోవడంతో క్షేత్రస్థాయిలో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. టార్గెట్లు పూర్తికాకపోతే ఉన్నతాధికారుల నుంచి వస్తున్న మెమోలు, వేతనాల్లో కోతలు ఉద్యోగులను మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. సర్వేల సునామీ వల్ల సచివాలయాల్లో అందాల్సిన సాధారణ సేవలు కుంటుపడుతున్నాయి. ధృవీకరణ పత్రాలు, ఇతర పౌర సేవల కోసం కార్యాలయాలకు వస్తున్న సామాన్య ప్రజలకు సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిబ్బంది అంతా సర్వేల పేరుతో బయట ఉండటంతో సచివాలయాలు వెలవెలబోతున్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, సర్వేల భారాన్ని తగ్గించి, సచివాలయ వ్యవస్థను తిరిగి పట్టాలెక్కించాలని సచివాలయ ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బాధ్యతలు స్వీకరణ శుభాకాంక్షలు వెల్లువ

చైర్మన్ గా బాధ్యతలు స్వీకరిస్తున్న వడ్డే వెంకట్

అనంతపురం న్యూటౌన్, జనవరి 21 ప్రభాతవార్త

ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా వడ్డే వెంకట్ బుధవారం తన చాంబర్లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లా డుతూ... ముందుగా తనపై నమ్మకం ఉంచి అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నారాలోకేష్‌కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. అదేవిధంగా ఉమ్మడి జిల్లా శాసన సభ్యులకు, పార్లమెంట్ సభ్యులకు, సహకరించిన కూటమి నాయకులందరికీ కృతజ్ఞతలు తెలియజే స్తు న్నామన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రంథాల యాల ను కేవలం పుస్తకాల నిలయాలుగానే కాకుండా, ఆధునిక విజ్ఞాన కేంద్రాలుగా తీర్చిదిద్దడమే నా ప్రధాన లక్ష్యమన్నారు. జిల్లాలోని ప్రతి గ్రంథా లయానికి పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు కృషి డానికి కృషి చేస్తానన్నారు. అలాగే కేవలం పట్టణాలకే పరిమితం కాకుండా, గ్రామీణ, మండల ప్రాంతాల్లో ఉన్న శాఖా గ్రంథాలయాలను కూడా బలోపేతం చేస్తామన్నారు. సామాన్య ప్రజలకు, రైతులకు, వృద్ధులకు ఉపయోగపడే దినపత్రికలు, మేగజైన్లు అందు బాటులో ఉంచుతామన్నారు. గ్రంథాలయాలను ఒక సామాజిక చైతన్య వేదిక లుగా మార్చడంలో ప్రజలు, మేధావుల, మీడియా మిత్రులు తమ వంతు సహకారా న్ని అందించాలని కోరారు. పుస్తక పఠనం అనే అలవాటును భావి తరాలకు అందించడమే మన అందరి బాధ్యత అని, అందుకు అనుగు ణంగా నేను పనిచేస్తాననన్నారు. చైర్మన్ పదవి అనేది బాధ్యతగా భావించి, జిల్లా గ్రంథాలయ సంస్థ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తానని, అందరినీ కలుపుకుని పారదర్శ కంగా పాలన అందిస్తానని తెలిపారు. అనంతరం తెలుగుదేశం పార్టీ నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ సం ఘాల నాయకులు, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమ, గ్రంథా లయ అధికా రులు, సిబ్బంది వేరువేరుగా కలిసి పుష్ప గుచ్చ ములు అందజేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

చైర్మన్ దంపతులను సన్మానిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారులు, ఉద్యోగులు

02ATP27_02ATP27.qxd 21-01-2026 PM 10:00 Page 1

కేజీబీవీలో బాల్య వివాహ్ ముక్త్ భారత్ - అవగాహన సదస్సు

బ్రహ్మసముద్రం జనవరి 21 ప్రభాతవార్త

కార్యక్రమం దృశ్యం

బ్రహ్మసముద్రం కేజీబీవీ పాఠశాల నందు కలెక్టర్ ఆదేశాల మేరకు బాల్య వివాహ్ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం బాల్య వివాహ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బి.ఆర్. శ్రీదేవి హాజరై విద్యార్థులను ఉద్దేశించి మొదట పిల్లల ప్రవర్తన, బాలలహక్కులు, బాలలరక్షణచట్టాలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో బాల్య వివాహాల పరిస్థితి, బాల్య వివాహం అంటే ఏమిటి, వాటికి గల కారణాలు, అలాగే బాల్య వివాహాల వలన బాలికల జీవితంలో కలిగే నష్టాలు గురించి వివరించారు. ఇదే సందర్భంగా శ్రీదేవి రక్తహీనత (అనీమియా) గురించి కూడా వివరించారు. ముఖ్యంగా ఆడపిల్లలు లక్ష్యాన్ని చేరుకున్న తర్వాతే పెళ్లి చేసుకోవాలి అనే సందేశాన్ని నినాదంగా పిల్లలతో పలికించారు. అనంతరం డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కృష్ణమాచారి చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సేవల గురించి వివరించారు. పిఓసిఎస్ఓచట్టం ప్రాముఖ్యతను పిల్లలకు తెలియజేస్తూ నా పేరు - నా లక్ష్యం అనే అంశంపై విద్యార్థులతో ఒక ఆక్టివిటీ నిర్వహించారు. అనంతరం సఖి సెంటర్ మేనేజర్ శాంతామణి వుమెన్ హెల్ప్ లైన్ 181 ,సఖి కేంద్రం ద్వారా అందించే సేవలపై అవగాహన కల్పించారు. అనంతరం ఇంచార్జి ఎస్.ఓ కురేషా విద్యార్థులకు చదువు ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనంగా ఐసిడిఎస్ సూపర్వైజర్లు ఖాసిం బీ రామాంజినమ్మ మ, డీసీపీయూ సిబ్బంది సోషల్ వర్కర్ వెంకట్ కుమార్ , ఔట్రీచ్ వర్కర్ కమలాక్షి జి.ఎం.ఎం.ఎస్.కే ప్రశాంతి , అలాగే పాఠశాల సిబ్బంది పాల్గొనడం జరిగింది. అనంతరం విద్యార్థులలో ఉత్సాహం పెంపొందించేలా ఆటల పోటీలు నిర్వహించగా, విజేతలైన విద్యార్థులకు బహుమతులను (ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్) అందజేశారు.

శ్రీ చిక్కన్నేశ్వర దేవాలయం నూతన కమిటీ ఎప్పుడు..?

ఎండోమెంట్ అధికారులు స్పందించరు ఎందుకు

హుండీ ద్వారా ఆదాయము 6,86,538

ఆలయ అభివృద్ధికి నూతన కమిటీ ఎంతైనా అవసరం

కనేకల్లు జనవరి 21 ప్రభాతవార్త

హుండి లెక్కిస్తున్న అధికారులు, గ్రామ పెద్దలు

కనేకల్లు మండల కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ చిక్కనేశ్వర దేవాలయం గత మూడు సంవత్సరాల నుండి హుండీ లెక్కింపు వాయిదా పడుతూ వచ్చింది ఎట్టకేలకు అధికారులు స్పందించి మూడు సంవత్సరాల నాలుగు నెలల తర్వాత బుధవారం హుండీ లెక్కింపు కార్యక్రమం ఎండోమెంట్ కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండోమెంట్ కమిషనర్ వెంకట కృష్ణ ప్రసాద్ జిల్లా జాయింట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ మాట్లాడుతూ. కనేకల్లు శ్రీ చిక్కనేశ్వర దేవాలయం ఎండోమెంట్ కి చెందిందా లేదా అనే అనుమానాలు పలువురిలో ఉన్నాయని. ఈ దేవాలయము ఎండోమెంట్ కి చెందినది అని వారు తెలిపారు. ముందుగా శ్రీ చిక్కనేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి గావించి హుండీ తాళాలు తీశారు. ఎండోమెంట్ అధికారుల పర్యవేక్షణలో ఆలయ ధర్మకర్త గ్రామ పెద్దల ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమం మధ్యాహ్నం ప్రారంభించారు. ఉదయం 10 గంటలకు హుండి లెక్కింపుకి వస్తామన్న అధికారులు మధ్యాహ్నానికి రావడంతో హుండీ లెక్కింపు ప్రారంభమైంది. హుండి లెక్కింపులో వచ్చిన మొత్తం ఆదాయాన్ని ఆలయం అకౌంట్ యూనియన్ బ్యాంక్ నందు జమ చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు గ్రామ పెద్దలు ఆలయానికి ఒక కమిటీ ఉండాలని ఒక కమిటీ ఉంటేనే మంచి చెడులు బాధ్యతాయుతంగా పాలన కొనసాగించవచ్చునని చర్చించినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో ఈవో దాసు బాబు, ఆలయ ధర్మకర్త ప్రసాద్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌గా డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి

గుంతకల్లు, జనవరి 21 ప్రభాతవార్త

కమీషనర్‌ను కలిసిన కళ్యాణ్‌చక్రవర్తి

మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌గా డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కొట్టాలపల్లి పీహెచ్‌సిలో పనిచేస్తున్న కళ్యాణ్ చక్రవర్తి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయం సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. అంతకుముందు ఆయన మున్సిపల్ కమీషనర్ నయీమ్‌అహమ్మద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

పేకాట స్థావరాలపై వేట

నలుగురు వ్యక్తులు అరెస్ట్ మూడు ద్విచక్ర వాహనాలు 6,830రూపాయల నగదు స్వాధీనం

శెట్టూరు, జనవరి 21 ప్రభాతవార్త

ఎస్ఐ.సుమన్

మండల పరిధిలోని ఖైరేవు గ్రామంలో బుధవారంపేకాట ఆడుతున్న వారిపై యస్ఐ .సుమన్ తన సిబ్బందితో దాడి చేసి నలుగురు పేకాట రాయుళ్ళను పట్టుకొని అరెస్ట్ చేసినట్లు యస్ఐ.తెలిపారు. వివరాలిలా.....జిల్లా ఎస్పీ జగదీశ్ ఆదేశాల మేరకు డీఎస్పీ రవిబాబు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నీలకంఠేశ్వర సూచనలు మేరకు కైరేవు గ్రామ పొలాలలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారివద్దనుండి మూడుద్విచక్ర వాహనాలు 6,830 /రూపాయలనగదునులను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు యస్ఐ.సుమన్ తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన ఇంచార్జ్ డీఎఫ్ ఓ చక్రపాణి

కళ్యాణదుర్గం టౌన్, జనవరి 21, ప్రభాత వార్త

అనంతపురం జిల్లా ఇంచార్జ్ డీఎఫ్ ఓ చక్రపాణి కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ను బుధవారం మార్యద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యేకు పుష్ప గుచ్చం అందజేశారు. అడవుల సంరక్షణ కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే అటవీ శాఖ అధికారులకు సూచించారు. డీఎఫ్ఓ వెంట కళ్యాణదుర్గం ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్ రామచంద్రుడు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే సురేంద్ర బాబుకు పుష్ప గుచ్చం అందజేస్తున్న దృశ్యం

కొడవలితో దాడి చేసిన వ్యక్తి అరెస్ట్

-రౌడీయిజం చేస్తే తాట తీస్తాం -డిఎస్‌పి మహేష్

లేపాక్షి, జనవరి 21 ప్రభాతవార్త

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి మహేష్

లేపాక్షి మండల పరిధిలోని పుల మతి, సడ్లపల్లిలో ఈ నెల 19న సాయికుమార్ అనే వ్యక్తి ప్రవీణ్‌కుమార్‌పై కొడవలితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు డిఎస్‌పి మహేష్ పేర్కొన్నారు. బుధవారం హిందూపురం డిఎస్‌పి కార్యాలయంలో డిఎస్‌పి మహేష్ హిందూపురం రూరల్ సిఐ జనార్ధన్, వన్ టౌన్ సిఐ రాజగోపాల్‌నాయుడు, లేపాక్షి ఎస్ఐ నరేంద్రతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ కొడవలితో దాడి చేసిన వ్యక్తి పరారవడంతో పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఉదయం 11 గంటల సమయంలో లేపాక్షి మండల పరిధిలోని సడ్లపల్లి, తిలక్‌నగర్ రహదారిలో సాయికుమార్‌ను అరెస్ట్ చేయడంతో పాటు దాడికి వినియోగించిన కొడవలిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ నెల 19న రాత్రి 11 గంటల సమయంలో సడ్లపల్లిలో సందీప్, ప్రవీణ్‌కుమార్, సాయికుమార్‌ల మధ్య ఘర్షణ జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో సాయికుమార్ ఇంటి నుండి కొడవలి తెచ్చి ప్రవీణ్‌కుమార్‌పై దాడి చేయడం జరిగిందన్నారు. ఈ సంఘటనలో ప్రవీణ్‌కుమార్ ఎడమ చేతికి తీవ్ర గాయాలయ్యాయన్నారు. బాధితుని తండ్రి నాగభూషణ ఫిర్యాదు మేరకు లేపాక్షి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయికుమార్‌ను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచామన్నారు. ఇది ఇలా ఉండగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రశాంతతకు భంగం కలిగిస్తే ఎంతటి వారినైనా కఠినంగా శిక్షించడం జరుగుతుందన్నారు. దౌర్జన్యాలు, రౌడీయిజంకు పాల్పడితే తాటతీస్తామని డిఎస్‌పి మహేష్ హెచ్చరించారు.

మానవత్వం మంట కలిసింది... మాతృత్వం కర్కశత్వంతో నిండింది

-నవజాత శిశువును ఆరుబయట పారేసిన వైనం

గుత్తి, జనవరి 21 ప్రభాతవార్త

అరుగుపై విసిరేసిన నవజాత శిశువు

గుత్తి పట్టణంలో మానవత్వం మంట కలిసిపోయి, మాతృత్వం కర్కశత్వంతో నిండిపోయి, ఆ మాతృమూర్తి సమాజానికి చీడ పురుగుగా ముక్కుపచ్చలారని నవజాత శిశువును చలికి ఆరు బయట పారవేసి, తన నైజంను బయట పెట్టుకున్న సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక వక్కల కుంట సమీపంలో నివాస ముంటున్న బంగారు షాప్ యజమాని మైనుద్దీన్ ఇంటి బయట అరుగుపై అప్పుడే పుట్టిన ఓ శిశువును పాలిథిన్ కవర్లో చుట్టి పడ వేశారు. సమాచారం అందుకున్న మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషా, ఏఎస్ఐ నాగమాణిక్యంలు తమ సిబ్బందితో ఆ ప్రాంతానికి చేరుకున్నారు. కొన ఊపిరితో ఉన్న ఆ శిశువును ఆసుపత్రికి తరలించాలని విఫలయత్నం చేయగా ఆ చిన్నారి అక్కడే మరణించింది. పంచనామా అనంతరం ఆ శిశువు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. కన్నతల్లి మాతృత్వాన్ని మరిచి చలిలో ఆ శిశువును రోడ్డుపై పారవేయడం పట్ల స్థానికులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ చిన్నారిని అనాథ శరణాలయంలో వదిలేసి ఉన్న ఆ నవజాత శిశువు బతికేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. సమాజానికి చీడ పురుగుగా ఆ మాతృమూర్తి చేసిన ఈ పని మాతృత్వానికే చెడ్డ పేరని...తనకు భారం అనిపించేందుకు గర్భం ఎందుకు దాల్చిందని ఆ ప్రాంత మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేగు బంధానికి విలువ లేకుండా ఆమె చేసిన ప్రవర్తన పట్ల ఆ ప్రాంత మహిళలు అసహ్యం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి నాయకులపై బురద చల్లడం తగదు

టిడిపి నాయకులు మాట్లాడుతున్న దృశ్యం

గుత్తి, జనవరి 21 ప్రభాతవార్త

మండలంలోని బసినేపల్లి గ్రామంలో చంద్రశేఖర్‌రెడ్డి అనే వ్యక్తికి చెందిన అరటి తోట దహనం అయిన వ్యవహారంలో కూటమి నాయకులపై వైసిపి నాయకులు బురద చల్లడం తగదని టిడిపి మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ నాగరాజు, బిజెపి మండల కన్వీనర్ చంద్రశేఖర్ విమర్శించారు. బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామంలో అందరూ ప్రశాంతంగా సమన్వయంతో జీవిస్తున్నారన్నారు. గ్రామంలో చిచ్చు పెట్టే విధంగా వైసీపీనాయకులు వ్యాఖ్యలు చేయడం తగదని వారు మండిపడ్డారు. ఈ సమావేశంలో నాయకులు విజయకుమార్, తోట బాబయ్య, నాగరాజు, నాగేంద్రప్ప, మాజీ ఎంపిటిసి పులికొండ, పాలమూరు బాబయ్య రాయల్, కంబయ్య, షరీఫ్, షెక్షావలి, రాము, మాబు, రామాంజనేయులు, సుమన్, రంగా, మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పార్టీ ఇచ్చిన బాధ్యతలను నిబద్ధతో పనిచేయాలి

ధర్మవరంటౌన్, జనవరి 21 ప్రభాతవార్త

మైనార్టీమోర్చాజిల్లా కమిటికి ఎంపికైన మైనార్టీలను సన్మానిస్తున్న బిజేపీ నేత హరీశ్ బాబు

బీజేపీ పార్టీ ఇచ్చిన బాధ్యతలను నిబద్ధతతో పనిచేయాలని నియోజవర్గ బీజేపీ ఇన్చార్జ్ హరీశ్ బాబు తెలిపారు. బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులుగా క్రిష్ణాపురం జమీర్‌అహమ్మద్, మైనార్టీమోర్చా జిల్లా ప్రదానకార్యదర్శి నబీరసూల్, కోశాదికారిగా సుహేల్, జిల్లాకార్యదర్శిగా అక్బర్, పట్టణప్రసిడెంట్‌గా షెక్షావలిలను రెండురోజులక్రితం పుట్టపర్తిలో బీజేపీజిల్లా అధ్యక్షులు జీఎంశేఖర్ సమక్షంలో ఎంపికచేశారు. వీరిని హరీశ్ బాబు బుధవారం స్థానిక ఎన్డీఏ కార్యాలయంలో శాలువాలతో సత్కరించారు. నూతనంగా ఎంపికైన వారు మాట్లాడుతూ.ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో మంత్రి సత్యకుమార్యాదవ్ మార్గదర్శకాలతో బీజేపీని మైనార్టీల్లో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. అనంతరం హరీశ్ బాబు మాట్లాడుతూ...పార్టీ ఇచ్చిన బాధ్యతలను నిబద్ధతో నిర్వహిస్తూ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడాలని సూచించారు. మైనార్టీసమస్యలను క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

అంతుచిక్కని తెగుళ్లతో వేపచెట్లకు ముప్పు..!

- చెట్ల ఆకులు, కొమ్మలు మొదలు కాండం సైతం ఎండిపోతున్న వైనం
- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితులు
- సర్వ రోగ నివారిణి అయిన వేపచెట్లకు మళ్లీ మొదలైన ముప్పు
- ప్రభుత్వం స్పందించి చెట్ల పరిరక్షణ చర్యలు చేపట్టాలంటున్న ప్రజలు

ఉరవకొండ, జనవరి 21 ప్రభాతవార్త

సర్వ రోగ నివారిణి అయిన వేపచెట్లకు ముప్పు వాటిల్లింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా పచ్చగా కళకళలాడుతూ కనిపించే చెట్లు నేడు ఆకులు మొదలు కొమ్మలు, కాండం వరకు పూర్తిగా ఎండిపోయి కళా విహీనంగా దర్శనమిస్తున్నాయి. ఇదివరకు నాలుగైదు సంవత్సరాల క్రితం ఈ పరిస్థితులు ఉండగా మళ్లీ ఇప్పుడు ఎక్కడ చూసిన వేపచెట్లు ఎండిపోయి కనిపిస్తుండటం అందరినీ ఆందోళనకు గురి చేస్తోంది. ఎన్నో ఔషధ గుణాలు కల్గిన వేప చెట్లు మానవాళి ఎన్నో అవసరాలను తీరుస్తూ దీర్ఘకాలిక వ్యాధులను నయం చేస్తున్నాయని అటువంటి చెట్లు కళ్లముందరే ఎండిపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే... వేపాకు, వేపపూత, కొమ్మలు, కాయలు, గింజలు ఇలా ప్రతిఒక్కటీ మనిషిని ఆరోగ్యంగా ఉంచడానికి పనికొస్తున్నాయి. నీడ,స్వచ్ఛమైనగాలిని అందించంతోపాటు వేపచెట్లకలప ఇంటి తలుపులు, కిటికీలు, బీరువాలు, మంచాలు ఒకటేమిటి రకారకాల గృహోపకరణాలు తయారుకు ఉపయోగపడుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో వేప చెట్లును ఎల్లమ్మ తల్లిగా పూజిస్తారు. ఎంతో విశిష్టతగల వేపచెట్లు నేడు ఎక్కడ చూసినా ఎండిపోయి కనిపిస్తుండటంతో సర్వత్రాఆందోళన మోదలైంది. నాలుగైదేళ్ల క్రితం ఈపరిస్థితులు కనిపించాయని మళ్లీ ఇప్పుడు అంతుచిక్కని తెగుళ్లతో చెట్లు మోత్తం ఎండిపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొలుత ఆకులు ఆపై కొమ్మలు, చివరికి కాండం కూడా ఎండిపోతోందని అయినా చెట్లను పరిరక్షించడానికి ఎలాంటి చర్యలు జరుగడంలేదని వాపోతున్నారు. వేపచెట్లు లేని ఊళ్లను ఊహించలేమని ఇంతటి విశిష్టతను సంతరించుకున్న వేపచెట్లను పరిరక్షించుకోకపోతే చాలా నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు. పంటలకు చీడ పీడలు ఆశిస్తే వెంటనే అక్కడికెళ్లి పంటలను పరిశీలించి రైతులకు సస్యరక్షణ, చీడ పీడల నివారణకు చేపట్టాల్సిన చర్యలను సూచించే వ్యవసాయ శాస్త్రవేత్తలు వేపచెట్లు ఎండిపోతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని సామాన్య ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇంటి పెరట్లో వేపచెట్టు ఉంటే ఆ ఇంట్లో ఉండే మనుషులకి ఎలాంటి రోగాలు దరి చేరవని చెబుతుంటామని అలాంటి చెట్లకు నేడు ముప్పు వాటిల్లితే మౌనం పాటించడం తగదంటున్నారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని వ్యవసాయ శాస్త్రవేత్తలను వెంటనే రంగంలోకి దింపి వేపచెట్లు ఎండిపోవడానికిగల కారణాలపై పరిశోధనలు జరిపి వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మండల పరిషత్ కార్యాలయం పక్కనగల అశ్వర్థం కట్టలోని భారీ వేపచెట్టు ఎండిపోతున్న దృశ్యం

యువత చారిటబుల్ ట్రస్ట్ లోగోను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

కళ్యాణదుర్గం టౌన్, జనవరి 21 ప్రభాతవార్త

యువత చారిటబుల్ ట్రస్ట్ లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

నమాజానికి సేవ చేయాలనే సంకల్పంతో కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన కొంతమంది యువకులు యువత చారిటబుల్ అనే ట్రస్ట్ ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే సురేంద్రబాబు చేతులమీదుగా యువత చారిటబుల్ ట్రస్ట్ లోగోను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో సేవా కార్యక్రమాల్లు నిర్వహించేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పేదలకు సహాయం చేసేందుకు చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసిన యువతను ఎమ్మెల్యే అభినందించారు.

శ్రద్ధ, ఏకాగ్రతతో పరీక్షలలో విజయం

వజ్రకరూరు జనవరి 21, ప్రభాతవార్త

విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎంఈఓ 2 తిమ్మప్ప

శ్రద్ధ ఏకాగ్రతతోనే పరీక్షలలో విజయం సాధించవచ్చుని ఎంఈఓ 2 తిమ్మప్ప విద్యార్థులకు సూచించారు. బుధవారం రాత్రి కొనుకొండ్ల లోనివిస్సీ సాంఘిక సంక్షేమ శాఖ బాలుర హాస్టల్ ను ఆయన సందర్శించి పదవ తరగతి విద్యార్థులకు పలు సూచనలు, పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించడానికి కావలసిన మెలకువలను వివరించారు. విద్యార్థులయొక్క అభ్యాసన సామర్థ్యాన్ని ఆయనపరీక్షించారు. విద్యార్థులపట్ల ప్రత్యేకశ్రద్ధచూపాలని వార్డెన్‌కు సూచించారు. విద్యార్థులు పరీక్షలలో మంచిమార్కులు సాధించి తల్లిదండ్రులకు హాస్టల్‌కు పేరు తీసుకు రావాలని సూచించారు.పరీక్షలుఅంటే భయపడకుండాప్రశాంతంగా ఉండాలన్నారు.

గుట్టు చప్పుడు కాకుండా.. మండల మీట్ పెట్టడంలో ఆంతర్యం ఏమిటి...?

మండల ప్రజా పరిషత్ లో అధికారుల నియంత పోకడ..

సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న సర్పంచ్

ధర్మవరం రూరల్ జనవరి 21 ప్రభాతవార్త

మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి సర్వసభ్య సమావేశం తప్పును సరిగా నిర్వహించాలి. ఈ సమావేశంలో ఏం జరిగింది...? ప్రజల సంక్షేమం అభివృద్ధి పనులపై ఏ విధంగా ప్రణాళికలు రూపొందించాలి. ఎక్కడ అభివృద్ధి పనులు చేపట్టాలి.. గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీరు, వీధిలైట్ల ఏర్పాట్లు, ముఖ్యంగా ఉపాధి హామీ పథకం పనులు చర్చించాల్సి ఉంది. అంతేగాక ముఖ్యంగా వివిధ శాఖలకు చెందిన అధికారులు ధర్మవరం మండల పరిధిలోని గ్రామాల్లో తమ శాఖ పరిధిలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టారు, ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో ఏ విధమైన చైతన్యం కల్పించాలన్న అంశాలపై తప్పనిసరిగా చర్చించాల్సి ఉంటుంది. మండలంలో ఎలాంటి అభివృద్ధి పనులకు ఎంపీటీసీలు సర్పంచులు, జెడ్పిటిసి వంటి ప్రజా ప్రతినిధుల ఆమోదం తీసుకోవాల్సి ఉంటుంది . ఈ విషయాలు అన్ని సమగ్రంగా ప్రజలకు తమ పత్రికలు ద్వారా తెలియజేయవలసిన బాధ్యత పాత్రికేయులకు ఉంటుంది. అయితే అధికారులు మాత్రం ఇవేమీ పట్టనట్టుగా గుట్టు చప్పుడు కాకుండా సర్వసభ్య సమావేశం అధికారులు నిర్వహించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గిరక రమాదేవి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మండల పరిషత్ అధికారి సాయి మనోహర్ తో పాటు డిప్యూటీ తసిల్దార్ ఈశ్వరయ్య, ఎంపీటీసీ, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది హాజరయ్యారు. ఈ సమావేశంలో గ్రామస్థాయిలో ఉన్న ప్రజా సమస్యలను తీర్చడం, అభివృద్ధి పనులపై చర్చించడం వంటి అంశాలపై సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేసి ఆమోదం తెలపడమే ఈ సమావేశంలో యొక్క ముఖ్య ఉద్దేశం. ప్రజా ప్రతినిధులు, అధికారులను ప్రశ్నించిన అంశాలు, చర్చించిన అంశాలను ప్రజల ముందు ఉంచే పాత్రికేయులకు సమాచారం లేకుండా సర్వసభ్య సమావేశం నిర్వహించడం గమనార్హం. తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశం నిర్వహించి ముగించినట్లు సమాచారం.

గుత్తి రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్‌కు జి.ఎం అవార్డు

గుత్తి, జనవరి 21 ప్రభాతవార్త

అవార్డుకు ఎంపికైన రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ సురేష్‌బాబు

గుత్తి రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ ఏ.సురేష్‌బాబుకు ప్రతిష్టాత్మక జి.ఎం అవార్డు లభించింది. 70వ రైల్వే వారోత్సవాలను పురస్కరించుకొని జోనల్ స్థాయిలో విశిష్ట రైల్ సేవా పురస్కార్-2025 అవార్డులను ప్రకటించారు. గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలో ఆయన పనితనాన్ని గుర్తించి అవార్డు ప్రకటించడంతో రైల్వే అధికారులు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు ఆయనను అభినందించారు. గతంలో ఆయనకు పిసిఒయం, పిసిఎస్ఓ సేఫ్టీ అవార్డు, డిఆర్ఎం అవార్డులు కూడా దక్కాయి. ఈ నెల 29న సికింద్రాబాద్ రైలు కళారంగంలో జిఎం సంజయ్‌కుమార్, శ్రీవాత్సవ చేతులు మీదుగా ఆయన అవార్డు అందుకోనున్నారు. తనకు సహకరించిన సిబ్బందికి ఈ సందర్భంగా స్టేషన్ సూపరింటెండెంట్ సురేష్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.

పరిటాలశ్రీరామ్‌ను కలిసిన నూతన కమిషనర్

ధర్మవరంటౌన్, జనవరి 21 ప్రభాతవార్త

పరిటాలశ్రీరామను కలిసిన నూతన కమిషనర్ వెంకటరమణయ్య

ధర్మవరం మున్సిపల్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటరమణయ్య బుధవారం అనంతపురంలో ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్‌నుకలిశారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్ పరిటాల శ్రీరామును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాన్ని అందజేశారు. పరిటాలశ్రీరామ్ మాట్లాడుతూ... ధర్మవరంలోటీడీపీప్రజలు అండగా ఉంటున్నారని, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా తాగునీటి సమస్య చెత్తను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా అధికారులు ఆదేశాలిచ్చి పర్యవేక్షించాలని కోరారు

మృతి చెందిన ఓటర్లను జాబితా నుండి తొలగించండి

- ఓటరు నమోదు అధికారిని కోరిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు

సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.తిప్పేనాయక్

ఉరవకొండ, జనవరి 21 ప్రభాతవార్త

డబుల్, మృతి చెందిన ఓటర్లను జాబితా నుండి తొలగించాలని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధు లు కోరారు. ఉర వకొండ అసెంబ్లీ నియోజకవర్గం- 149లోని ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు,

హాజరైన వివిధ రాజకీయ పార్టీల నాయకులు

తొలగింపులపై బుధవారం పట్టణంలోని మండల తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.తిప్పేనాయక్ అధ్యక్షతన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఫారమ్-7 దరఖాస్తులకు సంబంధించి ఆమోదం పొందిన దరఖాస్తుల వివరాలు అందించాలని జనసేన పార్టీ ప్రతినిధులు చంద్రశేఖర్, అచనాల కేశవ కోరారు. ఓటరు నమోదు అధికారి డి.తిప్పేనాయక్ మాట్లాడుతూ ఎస్ఐఆర్-2026 ఓటర్ల 2002కు 2025 ఓటర్లను మ్యాపింగ్ గురి ంచి వివరిస్తూ నియోజకవర్గంలో ఇప్పటివరకు 52.9శాతం మ్యాపింగ్ జరిగిందన్నారు. రాబోవు ఎస్ఐఆర్ 2026లో డోర్ టు డోర్ వెరిఫికేషన్ జరుగుతుందని కనుక ప్రతి రాజకీ

03ATP21_03ATP21.qxd 21-01-2026 PM 11:06 Page 1

కెఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో హాస్టల్ విద్యార్థులపై ఫీజులు బారాలు తగ్గించాలి

వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, జనవరి 21 ప్రభాతవార్త

కెఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో హాస్టల్ నిర్వహణ కోసం టెండర్లు ఆహ్వానించాలని ఎస్ఎఫ్ఐగా కేఎస్ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కి వినతి పత్రం అందజే శారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి ఓతురు పరమేష్, అధ్యక్షులు గిరి మాట్లాడుతూ.. అనం తపురం నగరంలో ఉన్నటువంటి మహిళా డిగ్రీ కళాశాల కేఎస్ఎన్ 9 సంవత్సరాల నుంచి ఒకే కాంట్రాక్టర్ హాస్టల్ నిర్వాహణ చేయడంపై విద్యా ర్థులపై అధిక ఫీజులు భారాలు పడు తున్నాయని విద్యార్థులపై ఫీజులు బారాలు తగ్గించాలని కోరారు. ఒక విద్యార్థి నుంచి ఒక సంవత్సరానికి 25000 వేల రూపాయలు హాస్టల్ నిర్వహణ కోసం కళాశాల ప్రిన్సిపల్ గారు వసూలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి శివ, నగరు ఉపాధ్యక్షులు నాగభూషణ్, మహేష్, వంశి తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిని ఇనుమడింపజేస్తున్న రాతిదూలపు పోటీలు

- టిడిపి ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ - వైభవంగా శ్రీ అంకాలమ్మ శ్రీ కుంటెమ్మ జాతర

- రాతిదూలపు పోటీల్లో మొదటి విజేతకు రూ.50 వేలను అందించిన గుమ్మనూరు ఈశ్వర్

రాతిదూలపు పోటీను ప్రారంభిస్తున్న గుమ్మనూరు ఈశ్వర్

మొదటి విజేతకు ఇవ్వాలని రూ. 50 వేలను అందజేస్తున్న దృశ్యం.

గుమ్మనూరు ఈశ్వర్‌ను సన్మాని స్తున్న దేవాలయ కమిటీ నిర్వాహకులు.

పామిడి, జనవరి 21 ప్రభాతవార్త

భారతీయ సంస్కృతిని ఇనుమడిం పజేసేలా రాతిదూలపు పోటీలను నిర్వ హిస్తుండటం శుభపరిణామం అంటూ ఇలాంటి వాటికి ఎల్లప్పుడూ ప్రోత్స హి స్తామని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మ నూరు జయరాం తనయుడు టిడిపి ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ పేర్కొ న్నారు. పట్టణ శివారు ప్రాంతం లోని కొండూరు రోడ్డులో వెలసిన శ్రీ అంకా లమ్మ శ్రీ కుంటెమ్మ అమ్మవార్ల 18వ జాతర అత్యంత వైభవంగా జరిగింది. భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు చేపడుతూ అమ్మవార్ల కృపకు పాత్రు లవుతూ తీర్థప్రసాదాలను స్వీకరి ంచారు. ప్రత్యేక అలంకరణలో దర్శన మిచ్చి న శ్రీ అంకాలమ్మ శ్రీ కుంటెమ్మ అమ్మ వార్లను దర్శించుకునేం దుకు తరలి వచ్చిన భక్తులతో దేవాలయ ప్రాంతం కిటకి టలాడింది.

గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు టిడిపి ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ దేవాలయానికి చేరుకుని అమ్మ వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేప ట్టారు. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన రాతిదూలపు పోటీలను ప్రారంభించిన గుమ్మనూరు ఈశ్వర్ పోటీల్లో గెలుపొందిన మొదటి విజేతకు రూ.50 వేలు ఇవ్వాలంటూ నిర్వాహకులకు అందజేశారు.

ప్రతి ఏటా రాతిదూలపు పోటీలకు సహకారం అంది స్తామని తెలియజేశారు. రాబోవు కాలమంతా వ్యవసాయం మీదనే కేంద్రీకృ తమై పూర్వవైభవాన్ని సంతరిం చుకుని రైతుల జీవితాల్లో సంతోషం విరాజిల్లుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. జాతరను పురస్కరించుకుని కొన్నేళ్ళుగా ఇక్కడ రాతిదూలపు పోటీల ను నిర్వహించటం ఆనవాయితీగా వస్తుందని తెలియజేసిన దేవాలయ కమిటీ నిర్వాహకులు టిడిపి ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్‌ను ఘనంగా సన్మానించారు.

మానవ నైతిక విలువలు పరీక్షకు 870 మంది గైర్హాజరు

అనంతపురం న్యూటౌన్, జనవరి 21 ప్రభాతవార్త

జిల్లాలో బుధవారం జరిగిన మానవ నైతిక విలువలు పరీక్షకు 24,603 గాను, 23,733 మంది హాజరు కావడం జరగగా, 870 మంది గైర్హాజర్ కావడం జరిగిందని జిల్లా పరీక్షల నిర్వహణ కమిటి, ప్రాంతీయ పర్యవేక్షణాధికారి యం.వెంకటరమణ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. కన్వీనర్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి 05 పరీక్షా కేంద్రాలను, జిల్లా వృత్తి విద్యాధికారి గురువయ్య శెట్టి 02 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారని తెలిపారు.

మూడురోజుల పాటూ భగవతి విజయేశ్వరి దేవి దివ్య సందే శాలు

అనంతపురం వైద్యం జనవరి 21 ప్రభాతవార్త

కరుణామయిగా సుప్రసిద్ధి చెందిన భగవతి విజయేశ్వరి దేవి దివ్య సందేశాలు మూడురోజుల పాటూ సాగుతాయని నిర్వాకులు తెలిపారు. ఈ మేరకు బుధవారం విజయేశ్వరి అమ్మ ప్రసంగించనున్న ఎస్ఎస్ఏఎన్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో విలేకర్ల సమావేశం జరిగింది. శ్రీమాతృశ్రీదేవి విశ్వ శాంతి ఆశ్రమం అధ్యక్షులు రవికాంత్ రమణ, పిన్ని సాయి వినోద్, కోనేటి సాయిప్రసాద్ తదితరులు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా కరుణమాయి దేవి అమ్మ 18 ఏళ్ల తర్వాత ఆనంత కొస్తున్నారని విశ్వశాంతిని చాటడమే పర్యటన విశేషమన్నారు. ఈ నేపథ్యంలో 24 సాయంత్రం 108 కలశాలతో, వేదమంత్రాలతో అమ్మవారికి ఘనంగా అత్మీయ స్వాగతం ఉంటుందన్నారు. 25న ఉదయం 6 గంటల న ఉండి. 8.30 గంటల వరకు సామూహిక ధ్యానం, అమ్మవారి దివ్యసందేశం. సాయంత్రం ఆశీర్వాదపూర్వక అనుగ్రహభాషణం, 26న ఉదయం ప్రసంగం, సాయంత్రం సామూహిక శ్రీ అచిత సహస్రనామ కుంకుమార్చన, అనుగ్రహ భాషణం ఉంటాయని తెలిపారు. కుంకుమార్చనలో పాల్గొనేవారు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చంద్రమోళి, ఉమామహేశ్వరి, దేవి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

25న లయన్స్‌క్లబ్ ఉచిత కంటి మెగా వైద్యశిభిరం

- డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు, రఘువీర్‌రావ్

డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు, రఘువీర్‌రావ్.

పామిడి, జనవరి 21 ప్రభాతవార్త

శ్రీ భావసార క్షత్రీయ కళ్యాణ మండపం నందు ఈనెల 25న ఆది వారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బెంగుళూరు శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అందత్వ నివారణ సంస్థ వారు ఉచిత కంటి మెగా వైద్యశిభిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆసంస్థ వ్యవస్థాక అధ్యక్షులు, ప్రభుత్వ ఆయూష్ సీనియర్ వైద్యాధికారి డాక్టర్ నల్ల పాటి తిరుపతినాయుడు, అధ్యక్షులు రఘువీర్‌రావు బుధవారం 'ప్రభా తవార్త' ద్వార తెలిపారు. ఉచిత కంటి మెగా వైద్యశి భిరంలో బెంగుళూరు శంకర కంటి ఆసుపత్రి కంటి వైద్యనిపుణులు కంటి చూపు మందగించిన వారిని పరీక్షించి అవసరమైన మందులను అందజేస్తూ అవసరమైతే ఆపరే షన్లకు రెఫర్ చేస్తారన్నారు. ఆపరేషన్లకు రెఫర్ అయిన వారిని బెంగుళూరు శంకర కంటి ఆసుపత్రి ఆర్గనైజర్లు ప్రత్యేక బస్సుల్లో తీసుకెళ్ళి ఆపరేషన్లు చేసిన తరువాత తిరిగి వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తారని తెలి యజేశారు. కంటి వైద్యశిభిరానికి హాజరయ్యే వారంతా ఆధార్ కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్టుసైజు ఫోటోలు తీసుకుని రావాలన్నారు. మండల ప్రజలు ఉచిత కంటి మెగా వైద్యశిభిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు, రఘువీర్‌రావు కోరారు.

ఉరుసు విజయవంతం చేసినందుకు

- అధికారులను దర్గా సన్మానించిన దర్గా సిబ్బంది

అధికారులను సన్మానిస్తున్న దృశ్యం

క్లాప్ మిత్రలను సన్మానిస్తున్న దర్గా సిబ్బంది

శింగనమల, జనవరి 21 ప్రభాతవార్త

మండల కేంద్రంలో ఈ నెల 16, 17, 18 తేదీల్లో జరిగిన హజరత్ సయ్యద్ సాలార్ మసూద్ ఘాజీ ఉరుసు మహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు సహకరించిన అధికారులకు బుధవారం మండల కేంద్రంలోని దర్గాలో దర్గా ముజావర్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు. ఎంపిడిఓ భాస్కర్, డిప్యూటీ ఎంపిడిఓ విజయ్‌కుమార్, అక్బర్, తరిమెల వైద్యాదికారి శంకర్‌నాయక్, పంచాయితీ సెక్రెటరీ తిప్పేస్వామి, డిజిటల్ అసిస్టెంట్ సురేష్ లను క్లాప్ మిత్రలను గ్రామంలో గనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముజావర్లతోపాటు నాయీబ్రాహ్మణ కార్పోరేషన్ డైరెక్టర్లు ఆదినారాయణ, ఆయకట్టు చైర్మన్ బోయ సత్యనారాయణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బళ్లారిలో పిస్తా హౌస్ గ్రాండ్‌గా ప్రారంభోత్సవంలో నార భరత్ రెడ్డి.

ప్రారంభోత్సవం చేస్తున్న దృశ్యం.

బళ్లారి జనవరి 21 ప్రభాతవార్త:

అధిక నాణ్యత గల ఆహారానికి పేరుగాంచిన ఖిపిస్తాఖి హౌస్‌ను బళ్లారిలో అంగరంగ వైభవంగా ప్రారంభించారు. నగరంలోని ప్రధాన వాణిజ్య ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఈ హోటల్ ప్రారంభోత్సవం ఎంతో ఉత్సాహంగా జరిగింది. నగర ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి మరియు పిస్తా హౌస్ లీదీ, హోటల్ ప్రిపరేటర్ సాయి సందీప్ రెడ్డి సంయుక్తంగా ఈరోజు పిస్తా హౌస్ రెస్టారెంట్‌ను ప్రారంభించారు. వ్యాపారవేత్తలు మరియు హోటల్ పరిశ్రమ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని హోటల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. సాంప్రదాయ పూజల తర్వాత, అతిథులు రిబ్బన్‌ను కత్తిరించి పిస్తా హౌస్‌ను అధికారికంగా ప్రారంభించారు. వెజ్జీ మరియు నాన్ వెజ్ అనే రెండు విభాగాలలో విస్తృతమైన మెనూ అందుబాటులో ఉన్నప్పటికీ, బిర్యానీలు, ప్రత్యేక కబాబ్‌లు, కూరలు, చైనీస్ వస్తువులు మరియు డెజర్ట్‌లు కస్టమర్లను ఆకర్షిస్తున్నాయి. కుటుంబాలు కలిసి భోజనం చేయడానికి ఈ హోటల్‌ను ప్రత్యేకంగా రూపొందించామని హోటల్ మేనేజర్ మల్లికార్జున రెడ్డి అన్నారు.

రోడ్డు భద్రత వారోత్సవాలు

మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రాజగోపాల్

మాట్లాడుతున్న వెహికల్ ఇన్స్పెక్టర్ రాజగోపాల్

నార్పల జనవరి 21, ప్రభాతవా మండల కేంద్రంలోని గుగుడు గ్రామం నందు ఎస్ కె ఎస్ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులతో రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా పాఠశాల యాజమాన్యలు షాకీర్ భాష సమావేశాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రాజగోపాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్ ఫోన్లు మాట్లాడుతూ మరియు మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. నిర్లక్ష్యంగా ఆటో రిక్షాలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. ఫోర్ వీలర్ నడిపేటప్పుడు సీట్ బెల్ట్ తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. ట్రాఫిక్ లైట్ల లోని ఎరుపు, ఆకుపచ్చ పశువు రంగు మొదలగువారి గురించి తెలియజేశారు.

మహిళలు మరియు పిల్లల భద్రత కోసం అక్క పాడే

జిల్లా కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్.కె. కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం.

బళ్ళారి జనవరి 21 ప్రభాతవార్త:

మహిళలు మరియు పిల్లల భద్రత కోసం బళ్లారి జిల్లాలో అక్క పడేఖి పథకాన్ని అమలు చేసినట్లు జిల్లా కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్.కె తెలిపారు. జిల్లా పరి పాలన, జిల్లా పంచాయతీ, జిల్లా పోలీసు శాఖ, జిల్లా న్యాయ సేవల అథారిటీ, మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ మరియు జిల్లా బాలల రక్షణ యూనిట్ సంయుక్తంగా నగరంలోని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయ హాలులో బుధవారం నిర్వహించిన ఖిఅక్క పడేఖి పథకం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభిస్తూ మాట్లాడారు. సమాజంలో మహిళలు మరియు పిల్లల హక్కులు మరియు చట్టాల గురించి మరియు వారు ఉల్లంఘించబడితే న్యాయం పొందడానికి వారు ఉపయోగించే పద్ధతుల గురించి అవగాహన కల్పించడమే లక్ష్యమని ఆయన అన్నారు. విద్య యొక్క పునాది ఇంటి నుండే ప్రారంభమవుతుంది. పోక్సో మరియు ఇంట్లో బాల్య వివాహం వంటి హానికరమైన పద్ధతుల గురించి అవగాహన కల్పించాలి.

జిల్లాలో అక్క పడే పథకం అమలు అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు మరియు జిల్లా యంత్రాంగం దీనికి అవసరమైన అన్ని సహాయాలను అందిస్తుందని అన్నారు. జిల్లా పోలీసు సూపరింటెం డెంట్ డాక్టర్ సుమన్ డి. పెన్నేకర్ సమావేశానికి అధ్యక్షత వహించి, హింసకు గురైన మహిళలు మరియు పిల్లలకు తక్షణ సహాయం, చట్టపరమైన అవగాహన మరియు సలహాలను అందించడం అక్కపడే పథకం లక్ష్యం అని అన్నారు. దీనిని పర్యవేక్షించడానికి ఒక సమీక్ష కమిటీని ఏర్పాటు చేశామని మరియు ప్రతి మూడు నెలలకు నివేదికను సమీక్షిస్తాము. ఇది మరింత ప్రభావవంతమైన అమలుకు వీలు కల్పిస్తుందని అన్నారు . మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామకృష్ణ.ఎం ప్రారంభ ప్రసంగం చేస్తూ, మహిళలు మరియు పిల్లలపై హింసను నివారించడానికి మహిళల భద్రత మరియు రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అక్కపాడే పథకాన్ని అమలు చేసిందని అన్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గత నవంబర్‌లో దీనిని ప్రారంభించారని ఆయన అన్నారు. జిల్లా పోలీసు శాఖ, మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ నేతృత్వంలోని ఈ చొరవలో పోలీసులు, హోమ్ గార్డులు మరియు శిక్షణ పొందిన విళీది క్యాడెట్‌ల బృందాలు మరియు నలుగురు మహిళా సిబ్బందితో కూడిన వాహనం షిఫ్ట్ సమయంలో బహిరంగ ప్రదేశాలలో గస్తీ తిరుగుతాయి. గృహ హింస, బాల్య వివాహం, లైంగిక వేధింపులు, వరకట్న వేధింపులు, మహిళల అక్రమ రవాణా వంటి ఏదైనా నేర కార్యకలాపాలు కమ్యూనిటీలలో కనిపిస్తే, వారు అత్యవసర హెల్ప్‌లైన్112, మహిళా హెల్ప్‌లైన్181 మరియు పిల్లల హెల్ప్‌లైన్ 1098లకు కాల్ చేసి సమాచారం అందించవచ్చని ఆయన అన్నారు. చిల్డ్రన్స్ స్పెషల్ యూనిట్ నోడల్ ఆఫీసర్ కూడా అయిన అదనపు పోలీస్ సూపరింటెండెంట్ కె.పి. రవి కుమార్ అతిథులను స్వాగతిం చారు. అక్కపాడ్డే ప్రాజెక్ట్ యొక్క పోస్టర్‌ను ఈ కార్యక్రమంలో ఆవిష్కరించారు. రోడ్డు భద్రతా అవగాహన ప్రచారం మరియు అక్కపాడ్డే పెట్రోల్ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి రాజేష్ ఎన్. హోసమానే, జిల్లా పంచాయతీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ముహమ్మద్ హారిస్ సుమేర్ , అదనపు పోలీసు సూపరింటెండెంట్ నవీన్ కుమార్.ఎన్., హోం గార్డ్స్ జిల్లా కమాండెంట్ షేక్ సాబ్, ప్రీయూనివర్శిటీ విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మణ్ హల్లాదమనే, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జలాలప్ప.కె., సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చిదానందప్ప, జిల్లా బాలల రక్షణ విభాగం జిల్లా బాలల రక్షణ అధికారి సుభద్రా దేవి, మహిళా పోలీస్ స్టేషన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ రమేష్ కులకర్ణి, పోలీసు అధికారులు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది, వివిధ సంస్థల ఆఫీస్‌అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

నిమ్మల శ్రీధర్ ఇంట తేనేటి విందులో వెంకటేశ్వరరావు

తేనెటీ విందులో పాల్గొన్న వెంకటేశ్వరరావు.

గోరంట్ల జనవరి 21 ప్రభాతవార్త

గోరంట్ల పట్టణ కేంద్రంలో తెలుగుదేశం పార్టీ మండల నాయకులు నిమ్మల శ్రీధర్ ఆహ్వానం మేరకు ఇంటికి తేనీటి విందులో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, రాష్ట్ర మంత్రివర్యులు సవితమ్మ భర్త వెంకటేశ్వర రావు. ఈ సందర్భంగా మంత్రి భర్త వెంకటేశ్వరరావు మండలానికి సంబంధించిన పలు విషయాలపై వారి మధ్య చర్చ సాగినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బాల కృష్ణ చౌదరి, తెలుగు యువత మండల అధ్యక్షులు అచ్యుత్ నాయుడు, పాలసముద్రం సింగిల్ విండో అధ్యక్షులు బెల్లా ల చెరువు చంద్ర, మైనార్టీ నాయకులు ఉమర్ ఖాన్, డీలర్ అజంతుల్లా, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రవి నాయక్, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ డిస్టిక్ నెంబర్ దేవరకొండ ఉమాశంకర్, ప్రకాష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బళ్లారి బ్యానర్ అల్లర్లు, ఫైరింగ్ ఘటన గురించి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోలేదు: బి.శ్రీరాములు

మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరాములు

.బళ్లారి జనవరి 20 ప్రభాతవార్త:

బళ్లారిలో జనవరి 1న బ్యానర్ అల్లర్ల ఫైరింగ్ సంఘటన విషయంలో సంబంధించి పోలీసులకు అన్ని రకాల ఆధారాలను అందించాను. అయితే, ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదని బిజెపి నాయకుడు, మాజీ మంత్రి బి.శ్రీరాములు అన్నారు. ఈరోజు నగరంలోని తన నివాసంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. కేసును సిఐడికి అప్పగించారని ఆయన అన్నారు. ఈ సంఘటనలో మాకు న్యాయం జరిగే వరకు మా పోరాటం కొనసాగుతుంది. మరోసారి హోంమంత్రిని కలిసి ఈ అంశంపై చర్చిస్తామని ఆయన అన్నారు. ఎమ్మెల్యేల మద్దతుతో నగరంలో చట్టవిరుద్ధ కార్యకలాపాలు నడుస్తున్నాయని ఆయన ఆరోపించారు. తెలంగాణ ఎన్నికల సమయంలో వాల్మీకి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్కామ్ జరిగింది. ఇప్పుడు ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ కేసు నడుస్తోంది. ఎక్సైజ్ మంత్రి ఆర్.బి. తిమ్మాపుర కుమారుడు ఇందులో ప్రత్యక్షంగా పాల్గొన్నాడు.

దానికోసం మంత్రివర్గం నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. సీఎం సీటు గందరగోళం గురించి మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం సీటు గందరగోళం పరిష్కారం కాకపోవడంతో అన్ని విభాగాల్లో అవినీతి పెరిగింది. ఇతర రాష్ట్రాల ఎన్నికల ఖర్చులకు కాంగ్రెస్ ఏటీఎంలా పనిచేస్తుందని ఆయన ఆరోపించారు. బాలిక కుటుంబానికి క్షమాపణ కోరిన బి.శ్రీరాములు. గంజాయి, మాదకద్రవ్యాల కారణంగా నగరంలో వేధింపులకు గురైన బాలిక గురించి నేను బహిరంగంగా మాట్లాడి ఉంటే, అది ఆ బాలిక కుటుంబాన్ని బాధపెట్టి ఉంటే క్షమాపణలు కోరుతున్నాను. నేను ఈ విషయాన్ని ప్రస్తావించకూడదు. నేను మాట జారి మాట్లాడాను. అందుకే నేను ఎల్లప్పుడూ ఆ బాలిక కుటుంబంతోనే ఉంటాను. ఈ విషయంలో నేను చట్టాన్ని ఎదుర్కొంటాను అని ఆయన అన్నారు. ఈ సందర్భంలో మాజీ ఎంపీ సన్న పక్కీరప్ప, బుడా మాజీ అధ్యక్షుడు పి.పాలన్న, బీజేపీ పార్టీ నాయకులు తిమ్మప్ప, ఓబలేష్, హలకుండి మల్లికార్జున గౌడ, కె. హనుమంతప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక గ్రామసభ

సామాజిక తనిఖీలు వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

రొళ్ల జనవరి 21 ప్రభాత వార్త:

మండలంలోని మేనేజర్ పంచాయతీలో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ జరిగింది. బుధవారం మండలంలోని మేజర్ పంచాయతీలో ఉపాధి హామీ పనులలో జరిగిన వివరాలను సామాజిక తనిఖీ అధికారి డిఆర్పి రాజేష్ పరివేక్షణలో నాలుగు రోజుల పాటు గ్రామంలో తిరిగి కూలీల నుండి వివరాలు సేకరించారు. ఈ మేరకు బుధవారం గ్రామపంచాయతీ ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామ సభను సర్పంచ్ రామలక్ష్మమ్మ సమక్షంలో నిర్వహించారు. జరిగిన పనుల వివరాలు ఉన్నలోపాల గ్రామ సభ దృష్టికి డి ఆర్ పి తీసుకొచ్చారు. 48 పనులకు గాను రూ.71వేలు ఖర్చు చేసినట్లు డియర్ పి వివరాలు వెల్లడిం చారు. అధికారులు సూచించిన కొలతల ప్రకారం పనులు చేసి ఉంటే వాటి వివరాలను సక్రమంగా ఫైల్ తయారు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్లు ఉపాధి కూలీలు తదితర రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

సచివాలయం, పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎంపిడిఓ

రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఓ

గుడిబండ జనవరి 21 ప్రభాతవార్త

మండలపరిధిలోని గుణేమోరుబాగలు, మోరుబాగలు గ్రామాల్లోని సచివాలయం పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను ఎంపిడిఓ కేశవరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఆయన కార్యాలయాల్లో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సమయానికి నాణ్యమైన భోజనాన్ని అందించాలని, ప్రతి విద్యార్థి విలువలతో కూడిన విద్యను అభ్యసించే విధంగా అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

04ATP21_04ATP21.qxd 21-01-2026 PM 10:39 Page 1

వైసిపి పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్ప మాకొద్దు.

- మున్సిపల్ చేజారడంతో ఎంపీపీ చేజారకుండా వైకాపా పార్టీ నాయకులు యత్నం

మడకశిర టౌన్ జనవరి 21 ప్రభాతవార్త

మడకశిర నియోజకవర్గం వైసీపీ పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్ప మాకొద్దు అంటూ వైసిపి పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డితో ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు మొరపెట్టుకున్నారు. ఐదు నెలల క్రితం మడకశిర మున్సిపాలిటీ చైర్మన్ పీఠం చేజారడంతో కనీసం మడకశిర మండలం ఎంపీపీ స్థానం చేజారకుండా వైకాపా పార్టీ శ్రేణులు మేల్కొని ఎంపీటీసీల పంచాయతీని అధినేత జగన్మోహన్ రెడ్డి వద్దకు తీసుకెళ్లారు. ఎంపీపీ కవిత సత్యనారా యణతో 9 మంది ఎంపీటీసీలు 5 మంది సర్పంచులు బుధవారం తాడేపల్లిలో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి వద్ద కలిసి పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ, సర్పంచులతో మీ సమస్య పరిష్కరించే విధంగా చర్యలు చేపడతానని ప్రస్తుతం మీరు వైకాపా పార్టీ బల్వపేతానికి కృషి చేయాలని ఇంత కాలం పార్టీ వెంట నడిచి క్షణికావేశంతో తప్పు చేయకండి భవిష్యత్తులో పార్టీ మీకు అండగా ఉంటుందని కూడా హామీ ఇచ్చారు. కలసికట్టుగా పనిచే యండి అని జగన్ మోహన్ రెడ్డి సూచించినట్లు పేర్కొన్నా రు.ఈ సంద ర్భంగా పలువురు ఎమ్ పి పి, ఎంపీటీసీలు, సర్పంచులు కూడా ఇన్చార్జి ఈరలక్కప్ప పై ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.పార్టీని అతను సమ న్వయంతో నడపలేదని పార్టీ నుంచి టిడిపి పార్టీలోకి ఎవరై నా బయటికి వెళుతు న్నారు అన్న వారిని కనీసం పలకరించి నిలువరించే ప్రయ త్నం చేయడం లేదని ఉంటే ఉంటారు వెళితే వెళ్తారు అన్న ధోరణిలో వ్యవహరిస్తారని తెలిపారు.

జగన్మోహన్ రెడ్డికి ఈరలక్కప్పపై ఫిర్యా దు చేస్తున్న ఎంపీపీ, ఎంపీటీసీలు

ఇవన్నీటికి త్వరలో మీకు సమా ధానం ఇస్తాను. వైకా పా పార్టీ ని బలోపేతం చేయడానికి నేను చర్యలు చేపడతానని హామీ ఇ స్తూ కలిసికట్టుగా పనిచేయాల ని అధినేత సూచించినట్లు వైకాపా శ్రేణులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా, సమ న్వయకర్త ఈరలక్కప్ప మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, నాయ కులు ఆర్, అనంతపురం తిమ్మప్ప, పార్టీ శ్రేణులు. పాల్గొన్నారు.

హిందూపురానికి రూ. 19.77 కోట్లు విడుదల

ఉపాధి పథకంతో గ్రామాల్లో రోడ్లు డ్రైన్లు - వర్కులన్నీ టిడిపి కేడర్‌కే..

హిందూపురం జనవరి 21 ప్రభాతవార్త

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రాలకు మంజూరైన నిధుల్లో హిందూపురం నియోజకవర్గానికి 19.77 కోట్ల రూపాయలు విడుదలయ్యాయి. శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఈ మేరకు నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. చిలమత్తూర్, లేపాక్షి, హిందూపురం రూరల్ మండలంలోని గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణానికి దీనిని ఖర్చు చేయనున్నట్లు ఎమ్మెల్యే బాలకృష్ణ పిఏ వీరయ్య బుధవారం తెలిపారు.

రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం ఎక్కడెక్కడ అవసరం ఉంటాయన్న అంశంపై వీరయ్య విస్తృతంగా పర్యటనలు చేసి ఆ మేరకు నివేదికను రూపొందించారు. దీని ఆధారంగా వర్కులను గుర్తించి కేటాయించేందుకు సిద్ధం చేశారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పేరు మార్చినందున ఏప్రిల్ ఒకటి నుంచి అది అమల్లోకి రానుంది. దీంతో ఇప్పటిదాకా మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం పేరు కింద చేపట్టుతున్న నిధులు ఖర్చు చేసే కాల పరిమితి మార్చి 31న ముగి యనుంది. నెల రోజుల్లోపు పనులు పూర్తి చేసేలా చర్య లు తీసుకునేం దుకు రోజుకు ఒక మండలం చొప్పున తెలు గుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమీక్ష చేస్తు న్నారు. బుధవారం హిందూ పురం మండలం పంచా యతీ ల వారీగా

వర్కులు కేటాయిస్తున్న పిఏ వీరయ్య

సమీక్షలు చేసి వర్కులను కేటాయించారు. టెండర్ ప్రాసెస్ కాకుండా నామినేషన్ ద్వారానే పనులు చేపడుతున్నందున ఈ మొత్తం విధు లు అన్నీ కూడా టిడిపి నాయకులు, కార్యకర్తలు చేప ట్టనున్నారు. దీంతో ఆ యా పంచాయతీల్లో పార్టీ శ్రేణుల మధ్య వర్కులు దక్కిం చుకునేందుకు తీవ్ర పోటీ నెలకొంది. సమీక్షలో మండల కన్వీనర్ రా ము, కొటిపి పంచాయతీ నాయకులు అరుణాచల్ రెడ్డి, ఉమాశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడు ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ అదనపు ప్రధాన కార్యదర్శిగా డా॥బోదపాటి చంద్రమోహన్

- డాక్టర్‌గా మొదలైన లత్తవరం నివాసి డా॥బోదపాటి చంద్రమోహన్ ఉద్యోగ ప్రస్థానం

- వ్యవసాయ కుటుంబంలో జన్మించిన నేడు అదనపు ప్రధాన కార్యదర్శి స్థాయికి

ఉరవకొండ, జనవరి 21 ప్రభాతవార్త

తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ అదనపు ప్రధాన కార్యదర్శిగా ఉరవకొండ మండలం లత్తవరం గ్రామానికి చెందిన డాక్టర్ బోదపాటి చంద్రమోహన్ పదవీ బాధ్యతలు చేప ట్టారు. తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి యం.కె.స్టాలిన్ ప్రభు త్వం ఆయన్ను నియమించగా ఇటీవల బాధ్యతలు చేపట్టారు. లత్తవరం గ్రామానికి చెందిన బోదపాటి వెంకట రమణప్ప, మైత్ర మ్మ దంపతుల ఒక్కగానొక్క సంతానమైన డాక్టర్ బోద పాటి చంద్రమోహన్‌ది సాధారణమైన రైతు కుటుంబం. తండ్రి వ్యవ సాయం చేస్తే తల్లి హెడ్ నర్సుగా ఉద్యోగ విరమణ చేశారు. ఎంబీబీఎస్ చదివి తొలుత కొయంబ త్తూరులో డాక్టర్ వృత్తిని చేపట్టిన డాక్టర్ బోదపాటి చంద్రమోహన్ సివిల్స్ సాధించి మధురై కలెక్టర్‌గా, దేవా దాయశాఖ కమీష నర్‌గా బాధ్యతలు నిర్వహిం చారు. ఈక్రమంలోనే ఆయ న్ను తమిళనాడు ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ అదనపు ప్రధాన కార్యదర్శిగా నియమిం చింది. రైతు కుటుంబానికి చెందిన వ్యక్తి దీక్ష, పట్టుదలతో అంచెల ంచెలుగా ఎదుగుతూ ఉన్నత శిఖరాలను అది రోహి స్తుండటంపై ఆయన స్వగ్రా మమైన లత్తవరంతోపాటు అనంత పు రం జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సందర్భం గా లత్తవరం గ్రామ మాజీ సర్పంచ్

తమిళనాడు ముఖ్యమంత్రి యం.కె.స్టాలిన్‌తో పాఠశాల విద్యా శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ బోదపాటి చంద్రమోహన్

లత్తవరం గ్రామ నివాసి డాక్టర్ బోదపాటి చంద్రమోహన్

బోదపాటి గోవిందప్ప (చిన్నాన్న) విలేఖరులతో మాట్లాడుతూ డాక్టర్ బోదపాటి చంద్రమోహన్ ఎన్నో ఉన్న తమైన పదవులను అల ంక రిస్తుం డటం సంతోషంగాను, గర్వంగా నూ ఉందన్నారు. ఆయన భవిష్యత్తులో మరింత ఎత్తుకు ఎదగాలని ఆకాం క్షించారు.

జూనియర్ కళాశాల ఆకస్మిక తనిఖీ చేసిన డివిఈఓ, ఎస్‌విఎస్ గురువయ్య శెట్టి

శింగనమల, జనవరి 21 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని జూని యర్ కళాశాలను డివిఇఓ ఎస్‌వి ఎస్ గురువ య్య శెట్టి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎథిక్స్, హ్యూ మన్ వ్యాల్యూస్ పరీక్షను పరిశీలిం చడానికి జూనియర్ కళాశాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. పరీక్ష అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ. పరీక్షలలో విజ యం సాధించడానికి నిజజీవితంలో నైతిక విలువలను పెంపొందించడానికి విలువైన సందేశాన్ని ఇచ్చారు. అనంతరం ఆయన విద్యా ర్థులతో కలిసి మధ్యాహ్న భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం 2026 ఇంటర్‌మీడియట్ పబ్లిక్ ఎగ్జామ్ ముందు విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలన్నారు.

విద్యార్థినీలకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న దృశ్యం

అయ్యంపల్లి అటవీ ప్రాంతంలో చెలరేగిన మంటలు

హెక్టారు వరకు పాక్షికంగా అటవీ ప్రాంతం దగ్ధం

- శాటిలైట్ ద్వారా జిల్లా అటవీ శాఖను అప్రమత్తం చేసిన అమరావతి అధికారులు

మంటలను ఆర్పుతున్న అటవీ శాఖ సిబ్బంది , తదితరులు

కంబదూరు, జనవరి 21, ప్రభాత వార్త

కంబదూరు మండలం అయ్యం పల్లి రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని అటవీ ప్రాంతంలో బుధవా రం మంటలు చెలరే గాయి. శాటిలైట్ ద్వారా మంటలు వ్యాప్తి చెందడాన్ని గుర్తించిన అమరావ తి పిసి సిఎఫ్ అధికారులు అనంతపురం జిల్లా అటవీ శాఖ అధికారిని అప్రమత్తం చేశారు.

దీంతో జిల్లా అటవీశాఖ అధికారి చక్రపాణి ఆదేశాలతో కళ్యాణదుర్గం ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్ రామచంద్రుడు ఆధ్వర్యంలో ఘటనా స్థలానికి చేరుకొని అటవీ శాఖ సిబ్బంది బీట్ ఆఫీసర్ నారాయణ ,కొంతమంది యువకులతో కలిసి ఈత చెట్ల కొమ్మలతో మంటలను ఆర్పారు. అప్పటికే అటవీ ప్రాంతంలో హెక్టార్ వరకు ఎండిన చెట్లు పాక్షికంగా కాలిపోయినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. పశువులను, మూగజీవాలను మేపడానికి అటవీ ప్రాంతంలోకి వచ్చిన వ్యక్తులు బీడీని కాల్చివేయడంతో ఈ సంఘటన జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు.

పీఎం కుసుమ్ కింద పది రోజుల్లోగా అన్ని ప్రాంతాల్లో పనులు మొదలుపెట్టేలా చర్యలు తీసుకుంటాం - ఇంచార్జి జిల్లా కలెక్టర్ సి.విష్ణు చరణ్

అనంతపురం కలెక్టరేట్ జనవరి 21 ప్రభాతవార్త

తిరుపతిలోని ఏపీఎస్పీడిసిఎల్ కార్యాలయం నుంచి పీఎం కుసుమ్, పీఎం సూర్యఘర్ పథకం మరియు అన్ని ఎన్ఆర్ఈడిసిఏపి ప్రాజెక్టులపై వైఎస్సార్ కడప, నెల్లూరు, చిత్తూరు, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంత పురం, శ్రీ సత్యసాయి జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్ లతో రాష్ట్ర ప్రభు త్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సమీక్ష నిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా సంయుక్త కలెక్టర్, ఇంచార్జి జిల్లా కలెక్టర్ సి.విష్ణు చరణ్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, ఏపీఎస్పీడీసీఎల్, నెడ్ కాప్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంచార్జి జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ జిల్లాలో పీఎం కుసుమ్ కింద జిల్లాలో 20 ప్రాంతాల్లో 111 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం చేపట్టిన అన్ని ప్రాజెక్టులను పది రోజుల్లో మొదలుపెట్టేలా అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇప్పటికే జరుగుతున్న పనులు వేగవంతంగా చేపడతామని తెలిపారు.ఈ వీడియో

వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా సంయుక్త కలెక్టర్

కాన్ఫరెన్స్ లో ఏపీఎస్పీడీసీఎల్ ఈఈలు జేవి.రమేష్, పద్మనాభ పిళ్లై, రాజశేఖర్, కన్స్ట్రక్షన్స్ ఈఈ శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో దళితులకు రక్షణ కరువైంది

- వైఎస్ జగన్‌వెంట ఉన్నారని దళితులపై దాడులు - వైసిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు నరసింహులు విమర్శ

అనంతపురం సిటీ, జనవరి 21 ప్రభాతవార్త

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దళి తులకు రక్షణ కరువైందని వైసిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు నరసిం హులు విమర్శించారు. జిల్లా వైసిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేక ర్లతో మాట్లాడుతూ.. పల్నాడు జిల్లాలో వైసిపి ఎస్సీ కార్యకర్త సాల్మన్ హత్య రెండు కుటుంబాల మధ్య జరిగిన గొడవ వల్లే జరిగిందని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. టిడిపి అధికారంలో ఎప్పుడు ఉన్నా దళితులకు రక్షణ ఉండదని నాటి కారంచేడు దళితుల ఊచకోత ఘటన నుంచి నేడు సాల్మన్ హత్య వరకు జరిగిన ఘటనలే నిదర్శ నమన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆ గ్రామంలో 300 దళిత కుటుంబాలు గ్రామం విడిచి వెళ్లింది వాస్తవం కాదా అని ఆయన ప్రశ్నిం చారు. సాల్మన్ హత్య రాజకీయ గొడవ కాదని ఎంఎస్. రాజు మాట్లాడటం సమంజసం కాదన్నారు. జిల్లాలో సైతం నీ ని యోజక వర్గం పక్కనే ర ఆమగిరి మండలం ఏడు గుర్రాలపల్లి గ్రామంలో 14 సం వత్సరాల బాలికపై అత్యాచార ఘటన నీకు కనిపించ లేదా అని ఆయన ప్రశ్నించారు. అదే విధంగా అనంతపురంలో దళిత విద్యార్థిని తన్మయి హత్య చోటు చేసుకుందని, ఏనాడైనా ఆ కుటుంబాలను పరామర్శించావా అని ఆయన ప్రశ్నించారు. మీ అధినేతను పొగడటం తప్పా దళితులకు నీవు చేసో ంది ఏమిటని ఆయన ప్రశ్నించారు. జిల్లాలో దళితుల భూము లను లాక్కు ంటుండటం మీకు కనిపించడం లేదా అన్నారు. అదే విధంగా ఒక వైపు దళి తులను మోసం చేస్తూ, మరో వైపు దళితులు మోసపోవద్దని ఎం ఎస్‌రాజు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఇప్పుడు అధికారంలో ఉన్నది మీ పార్టీనేనని దళితు లను మోసం చేస్తోంది కూడా మీరేనని ఆయన

మాట్లాడుతున్న ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు నరసింహులు

విమర్శించా రు. కూటమి ప్రభుత్వంలో దళితుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని ఆయన మండి పడ్డారు. దళిత పారిశ్రామిక వే త్తలు తమకు రావాల్సిన రూ.1500 కోట్ల ఇన్సెంటివ్ కోసం రోడ్డుపై ధర్నాలు చేస్తున్నారని వారి సమస్యను పట్టించుకునే దళిత ప్రజా ప్రతినిధులు పట్టించు కోవడం లేదని ఆయన విమర్శించారు. దళితులకు గుర్తింపును, గౌరవాన్ని ఇచ్చిన ఘనత వై ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. విజయవాడ నడిబొడ్డున అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి దళితుల గౌర వం కాపాడారని ఆయన కొనియాడారు. దళితులంతా వైసిపి వైపే ఉన్నారన్న అక్కసుతోనే దళితులపై కూటమి పాలనలో దాడులు అధికమయ్యాయని ఆయన విమర్శించారు. మీరెన్ని దాడులు, దౌర్జన్యాలు చేసినా దళితులం తా వైఎస్ .జగన్ మోహ న్‌రెడ్డి వెంటే నడుస్తారని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో వైసిపి నాయ కులు రాఘవ, మహిళా నేతలు శోభ, అంజలి తదితరులు పాల్గొన్నారు.

ఆ ఇద్దరు అధికారులతీరుపై నిఘా వర్గాల కన్ను

యాడికి(తాడిపత్రి),జనవరి21, ప్రభాతవార్తః

యాడికి మండలానికి సంబంధించి కీలకంగా వ్యవహరిస్తున్న రెండు శాఖలకు చెందిన ఇద్దరు అధికారుల తీరుపై నిఘా వర్గాలు కన్నేసినట్లు సమా చారం. శాంతి భద్రతల సమీక్షలో భాగంగా రాష్ట్ర పోలీసు శాఖలో ప్రధాన భూమిక పోషించే ఆ శాఖ ఆ ఇద్దరు అధికారుల అవినీతిని నిశితంగా పరిశీలించి నివేదిక పంపినట్లు తెలుస్తోంది. తమ శాఖ పరిధిలో ఏ పనికి ఎంత మొత్తం లంచం తీసుకుంటున్నారు, ఇటీవల ఏయే కార్యక్రమాల్లో ఏయే రీతిన ఎంతెంత సొమ్ము, ఎవరెవరి ద్వారా వసూళ్లకు పాల్పడ్డారనే పక్కా సమచారాన్ని ఆ శాఖ సేకరించి ఉన్నతాధికారులకు నివేదించినట్లు విశ్వసనీయ సమాచారం. మండలంలో తమ శాఖలను అవినీతితో అపఖ్యాతి పాలు చేస్తున్న ఆ ఇద్దరు అధికారుల తీరుపై మండలంలోని ప్రజలు కూడా తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్న విషయం బహిరంగ రహస్యమే.

జేసీ జోక్యంతో నిరసన విరమణ

తాడిపత్రి, జనవరి21, ప్రభాతవార్తః

తాడిపత్రి మండలం భోగసముద్రం గ్రామ సమీపంలోని సుగుణ స్పాంజ్ అండ్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్ వద్ద కార్మికులు ఏకధాటిగా 12 గంటల పాటు చేపట్టిన నిరసనను మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి బుధవారం విరమింపజేశారు. తమ సమస్యల సాధన కోసం మంగళవారం సాయంత్రం ఆ ఫ్యాక్టరీ కార్మికులు నిరసనకు దిగిన సంగతి విదితమే. ఫ్యాక్టరీ గేటు మూసివేసి నిరసనకు దిగడం పట్ల జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడిపత్రి పరిధిలో ఫ్యాక్టరీలు మూసివేయించే విధానం సరికాదని, ఏవైనా సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని కార్మికులకు ఆయన సూచించారు.

కంపెనీ ప్రతినిధులు, కార్మికులతో ఆయన చర్చించారు. కంపెనీ ప్రతి నిధులకు మూడు రోజులు వ్యవధి ఇచ్చి వేచి చూడాలని కార్మికులకు ఆయన సూచించారు. జేసీ సూచనకు కంపెనీ ప్రతినిధులతో పాటు అంగీకరించిన

కంపెనీ ప్రతినిధులు, కార్మికులతో చర్చిస్తున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

కార్మికులు నిరసన విరమించి విధుల్లోకి వెళ్లారు. దాదాపు 300 మంది కార్మికుల సమస్యలకు త్వరలోనే పరిష్కారం లభించనుందని ఈ సం దర్భంగా కార్మికులు ఆశా భావం వ్యక్తం చేశారు.

ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షించే వ్యాధి నిరోధక టీకాలను అందించండి

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగశశిభూషణ్‌రెడ్డి

శింగనమల, జనవరి 21 ప్రభాతవార్త

నిర్దేశించిన గడువు ప్రకారం ప్రతి గర్భవతికి, చిన్నారులకు ప్రాణా ంతక వ్యాధుల నుంచి రక్షించే వ్యాధి నిరోధక టీకాలను అంది ంచా లని జిల్లా ఇమ్యు నైజేషన్ అధికారి డా .నాగశశిభూ షణ్‌రె డ్డి వైద్య సిబ్బందిని ఆదేశిం చారు. ఆయన బుధవారం మండల పరిధి లోని లోలూరు వెల్‌నెస్ సెంటర్‌లో జరుగుతున్న వ్యాధి నిరో ధక టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ.. మాతా శిశు సంరక్షణ కార్డులను పరిశీలించి అం దులో గర్భకాలం నుంచి ప్రసవం అనంతరం 42 రోజుల వరకు అందించే వివిధ సేవలను పొందుపర్చాలన్నారు. అనంతరం రఘునా థపురం గ్రామంలో జరుగుతున్న 104 సంచార వాహన వైద్య చికిత్స కేంద్రా న్ని జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ విష్ణుమూర్తితో కలిసి ఆయన పరి శీలించారు. ఈ కార్యక్రమంలో తరిమెల ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.శం కర్‌నాయక్, ఎంఎల్‌హెచ్‌పి ఉషా, ఆశావర్కర్లు మదర్‌బి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మెలాథియన్ మందు పిచికారి : మండల కేంద్రంలోని కెజిబివి ఎస్సీ బాలుర వసతి గృహం, బిసి బాలుర వసతి గృహం, కెజిబివి టైప్-4 బాలికల వసతి గృహాల్లో కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగ్యూ తదితర జ్వరాల భారిన విద్యా ర్థులు పడకుండా దోమల పెరుగుదల నివారణకు అనంతపు రం మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, పర్యవేక్షకులు నూర్‌బాషా, శ్రీధర్‌మూర్తి ఆధ్వర్యంలో మెలాథియన్ మందు పిచికారి చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ గంగాధర్, ఎంపిహెచ్ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ నాగశశిభూషన్‌రెడ్డి

బాలుర వసతి గృహంలో మెలాథియన్ మందును పిచికారి చేస్తున్న దృశ్యం

చెడు అలవాట్లకు దూరంగా ఉండండి చదువులపై శ్రద్ధ చూపండి

గంజాయి దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన

అనంతపురం కలెక్టరేట్ జనవరి 21 ప్రభాతవార్త

జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు అహగాహన కార్యక్రమం నిర్వహించిన అనంతపురం టూటౌన్ పోలీసులు అనంతపురంలోని అరవింద్ నగర్‌లో ఉన్న ఎస్‌కేడీ హై స్కూల్ లో మాదక ద్రవ్యాలపై, ముఖ్యంగా గంజాయి వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై టూటౌన్ పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టూటౌన్ సి.ఐ శ్రీకాంత్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, అవి ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా భవిష్యత్తును కూడా నాశనం చేస్తాయని వివరించారు. గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం వల్ల శారీరక, మానసిక సమస్యలతో పాటు చట్టపరమైన ఇబ్బందులు ఎదురవు తాయని తెలిపారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, చదు వుపై దృష్టి సారించి మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. మాదక ద్రవ్యాల అక్రమ వినియోగం లేదా రవాణాపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గంజాయి నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు